క్లుప్తంగా

శివరాత్రి ఏర్పాట్ల పరిశీలన



ఘాట్లలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పిస్తున్న డీఎస్పీ భవ్యకిశోర్

కంబాలచెరువు: మహా శివరాత్రి సందర్భంగా భక్తులకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా ముందస్తు జాగ్రత్త చర్యగా సౌత్‌జోన్ డీఎస్పీ భవ్యకిశోర్, సీఐ కె.మంగాదేవి నగరంలోని గోదావరి నది ఘాట్లను గురువారం పరిశీలించారు. టూ టౌన్ పోలీస్ స్టేషన్ పరిధి గౌతమీ ఘాట్, దోభీ ఘాట్, సరస్వతి ఘాట్‌లను చూశారు. అనంతరం గోదావరి నదికి వచ్చే భక్తులు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, అత్యవసర సమయాల్లో ఎవరిని సంప్రదించాలనే విషయాలపై ప్రజలకు అవగాహన కల్పించారు.

ఆధార్ అనుసంధానానికి ప్రత్యేక కౌంటర్లు

రాజమహేంద్రవరం సిటీ: రాజమహేంద్రవరం పోస్టల్ డివిజన్ ఆధ్వర్యంలో ఆధార్, మొబైల్ ఫోన్ అనుసంధానం కోసం ప్రత్యేక కౌంటర్లు అందుబాటులోకి తెచ్చామని రాజమహేంద్రవరం పోస్టల్ డివిజన్ సూపరింటెండెంట్ కోట శేషారావు గురువారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. రాజమహేంద్రవరం ప్రధాన పోస్టాఫీస్‌తో పాటు దానవాయిపేట, ఆర్యాపురం, శ్రీరామ్‌నగర్, ధవళేశ్వరం, కడియం, ద్వారపూడి, అనపర్తి, మండపేట, రామచంద్రపురం పోస్టాఫీసుల్లో కౌంటర్లు అందుబాటులో ఉంటాయన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ పథకాల నుంచి ప్రత్యక్ష నగదు బదిలీలకు, రైతులకు భూ ఆధార్ రిజిస్ట్రీ కోసం, కేంద్ర ఆరోగ్య శాఖ ద్వారా ఆయుష్మాన్ భారత్ ఆరోగ్య కార్డుల జారీ కోసం వివిధ రకాల ప్రభుత్వ పథకాల కోసం అధార్ మొబైల్ అనుసంధానం చేసుకోవడం తప్పనిసరి అన్నారు.

వైఎస్సార్ సీపీ రాష్ట్ర రైతు విభాగ కార్యదర్శిగా వెంకట్రాజు

సీతానగరం: వైఎస్సార్ సీపీ రాష్ట్ర రైతు విభాగ కార్యదర్శిగా వలవల వెంకట్రాజు (తోటలోరాజు) ఎంపికైనట్లు పార్టీ కేంద్ర కార్యాలయం నుంచి ఉత్తర్వులు అందుకున్నారు. రాజానగరం నియోజకవర్గం సీతానగరానికి చెందిన వలవల వెంకట్రాజు ఎంపిక పట్ల మండల పార్టీ నాయకులు హర్షం వ్యక్తం చేశారు. ఆయన మాట్లాడుతూ పార్టీ అభివృద్ధికి కృషి చేస్తానని, పార్టీలో పదవి పొందడానికి తనకు సహకరించిన పార్టీ యువజన విభాగం రాష్ట్ర అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే జక్కంపూడి రాజా, పీఏసీ సభ్యురాలు జక్కంపూడి విజయలక్ష్మి, ఉభయ గోదావరి జిల్లాల పార్టీ యువజన విభాగం రీజనల్ కో ఆర్డినేటర్ జక్కంపూడి గణేష్‌లకు కృతజ్ఞతలు తెలిపారు. ఎంపీపీ గుర్రాల జ్యోత్స్న, మండల కన్వీనర్ ఘంటా శ్రీనివాస్, జిల్లా సేవాదళ్ అధ్యక్షుడు పెదపాటి డాక్టర్‌బాబు, కో కన్వీనర్ కరుటూరి శ్రీహరిబాబు, పార్టీ నాయకులు, కార్యకర్తలు వెంకట్రాజు ఎంపిక పట్ల హర్షం వ్యక్తం చేశారు

బాబాను తాకిన సూర్య కిరణాలు



బలభద్రపురంలో బాబా ముఖాన్ని తాకిన సూర్యకిరణాలు

బిక్కవోలు: బలభద్రపురం ఆంధ్రా షిర్డీ సాయి మందిరంలో కొలువైన బాబా విగ్రహాన్ని సూర్యకిరణాలు తాకాయి. గురువారం ఆలయం వ్యవస్థాపక అధ్యక్షుడు నల్లమిల్లి పురుషోత్తమరెడ్డి మాట్లాడుతూ బాబా విగ్రహంపై ఏటా సూర్యకిరణాలు తాకుతున్నాయన్నారు. బాబా తల నుంచి నుదురు, కంఠం, ఛాతి, ఉదరం నుంచి పాదాల వరకు ఈ కిరణాలు చేరుతాయన్నారు. వచ్చిన భక్తులకు అన్నసమారాధన ఏర్పాటు చేశారు.

అసభ్యకర పోస్టులు పెట్టారని ఫిర్యాదు

సీతానగరం: ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, వారి కుటుంబ సభ్యులతో కలసి మహా కుంభమేళా పుణ్యస్నానాల ఫొటోలను మార్ఫింగ్ చేసి, సామాజిక మాధ్యమాల్లో అసభ్యకరమైన పోస్టులు పెట్టారని సీతానగరానికి చెందిన జనసేన నాయకుడు మట్ట వెంకటేశ్వరరావు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని ఎస్సై డి.రామ్‌కుమా ర్ గురువారం తెలిపారు. ఐడీ ప్రూఫ్‌లతో ఫిర్యా దు చేశారని, కేసు దర్యాప్తు చేస్తున్నామన్నారు.

వెళ్దాం రండీ.. గురుకులానికి..

- ఐదో తరగతి, ఇంటర్‌లో ప్రవేశాలకు దరఖాస్తులు
- మార్చి 3 వరకు గడువు
- సీటు సాధిస్తే భవిష్యత్తుకు భరోసా



బొమ్మూరులో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ సాంఘిక సంక్షేమ శాఖ గురుకుల పాఠశాల/ కళాశాల

రాజమహేంద్రవరం రూరల్: చదువుకోవాలనుకునే వారికి గురుకులాలు ఓ సువర్ణావకాశం. ఇక్కడ ఉచిత వసతి సౌకర్యంతో ఉత్తమ విద్యను పొందచ్చు. పేద, మధ్య తరగతి వర్గాల్లోని ఎస్సీ, ఎస్టీ, బీసీలకు బొమ్మూరులోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల బాలికల పాఠశాల, కళాశాలల్లో 2024–25 విద్యా సంవత్సరానికి ఐదో తరగతి, జూనియర్ ఇంటర్(ఎంపీసీ, బైపీసీ) ఆంగ్ల మాధ్యమంలో చేరేందుకు సాంఘిక సంక్షేమ శాఖ నోటిఫికేషన్ జారీ చేసింది. ఈ దరఖాస్తులకు మార్చి 6వ తేదీ తుది గడువు. ఏప్రిల్ 6న ప్రవేశ పరీక్ష నిర్వహించనుంది. ఇందులో ప్రవేశం దక్కితే ఇంటర్ వరకూ ఉచితంగా చదువుకోవచ్చు. నీట్/ ఐఐటీల ప్రవేశాలకు సిలబస్‌తో పాటే శిక్షణ ఉంటుంది.

ఇక్కడ ప్రత్యేకతలు ఇవీ..

నాణ్యమైన, పర్యవేక్షణ కూడిన విద్య అందిస్తారు. ప్రభుత్వ మెనూ ప్రకారం పోషక విలువలతో కూడిన భోజన సౌకర్యం కల్పిస్తారు. అన్ని సౌకర్యాలతో కూడిన వసతి గృహం ఉంటుంది. నాలుగు జతల యూనిఫామ్, పీటీ డ్రెస్ ఇస్తారు. కంప్యూటర్, స్పోకెన్ ఇంగ్లిషులో శిక్షణ ఉంటుంది. నిబంధనలకు లోబడి అన్ని ప్రభుత్వ పథకాలు వర్తింపజేస్తారు. వ్యక్తిత్వ వికాసం, కెరీర్ గైడెన్స్‌లో శిక్షణ, బ్యూటీ అండ్ వెల్‌నెస్ ఉంటుంది. అటల్ టింకరింగ్ ల్యాబ్ ద్వారా ఆధునిక సాంకేతిక అంశాలలో శిక్షణ ఇస్తారు. చదువుతో పాటు అన్నిరంగాల్లో విద్యార్థినులను తీర్చిదిద్దుతారు. ఒకేషనల్ ఎడ్యుకేషన్‌లో భాగంగా క్రాఫ్ట్స్ తయారీలో శిక్షణ అందిస్తారు. ఎంసెట్, నీట్, ఐఐటీలలో సీటు సాధించేలా ప్రత్యేక శిక్షణ ఇస్తారు. యోగా, కరాటే నేర్పిస్తారు. ఇంటర్ అనంతరం ఉద్యోగావకాశాలు పొందేలా కమ్యూనికేషన్ స్కిల్స్ పెంపొందిస్తారు.

విద్యార్థులు సాధించిన విజయాలు

బొమ్మూరులోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల బాలికల పాఠశాల, కళాశాలల్లో విద్యార్థులకు అనేక విజయాలు సాధించారు. జగనన్న ఆణిముత్యాలు పథకంలో జిల్లా స్థాయిలో పారితోషికం అందుకున్నారు. శ్రేష్ఠ నేషనల్ టాలెంట్ టెస్ట్‌లో అనేక మంది విద్యార్థినులు ప్రతిభ కనబరిచారు. గణతంత్ర దినోత్సవ వేడుకల్లో పాల్గొని నృత్య ప్రదర్శనలో విద్యార్థినులు జిల్లా స్థాయిలో ద్వితీయ బహుమతి సాధించారు. ఇస్రో క్విజ్‌లో సైంటిస్ట్‌ల చేతుల మీదుగా బహుమతులు పొందారు. కౌశల్ క్విజ్ కాంపిటేషన్‌లో స్టేట్ లెవెల్ బహుమతులు దక్కించుకున్నారు. 2021–23, 2022–24 బ్యాచ్‌ల్లో ఇంటర్ విద్యార్థినులు హెచ్‌సీఎల్ కంపెనీలో ఇంటర్న్‌షిప్‌కు అర్హత సాధించారు.

పేద పిల్లలకు వరం



గురుకులాల్లో ఐదో తరగతి, ఇంటర్ ప్రథమ సంవత్సరాల్లో ప్రవేశాలకు నోటిఫికేషన్ విడుదలైంది. చదువుపై ఆసక్తి ఉన్న పేద విద్యార్థులకు ఇదో మంచి అవకాశం. ఐదో తరగతిలో చేరితే ఇంటర్ వరకూ చదువు, వసతి, అవసరమైన సదుపాయాలు ఉచితంగా ఉంటాయి. అనుభవజ్ఞులైన ఉపాధ్యాయులచే శిక్షణ ఇస్తారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి.

– ఎ.వాణీకుమారి, ప్రిన్సిపాల్, గురుకుల బాలికల పాఠశాల/కళాశాల, బొమ్మూరు

ఐదో తరగతిలో ప్రవేశానికి అర్హతలు

ఎస్సీ, ఎస్టీ విద్యార్థినులు 2012 సెప్టెంబర్ 1 నుంచి 2016 ఆగస్టు 31వ తేదీ మధ్య జన్మించి ఉండాలి. మిగిలిన వారు 01.09.2014 సెప్టెంబర్ 1 నుంచి 2016 ఆగస్టు 31 మధ్య పుట్టిన వారు అర్హులు. 2023–24 విద్యా సంవత్సరంలో 3వ తరగతి, 2024–25లో నాల్గో తరగతి ప్రభుత్వ గుర్తింపు పొందిన పాఠశాలలో చదువు పూర్తి చేయాలి. తల్లిదండ్రుల వార్షిక ఆదాయం 2024–25 నాటికి రూ.లక్ష మించి ఉండరాదు. మొత్తం సీట్లు 80 ఉండగా ఎస్సీలకు 60, బీసీ–సీ 10, ఎస్టీలకు 5, బీసీ–4, ఇతరులకు –1 కేటాయించారు.

ఇంటర్ ప్రవేశానికి అర్హతలివి

2024–25లో పదో తరగతి పరీక్ష రాసే విద్యార్థులు మాత్రమే అర్హులు. 2025 ఆగస్టు 31 నాటికి 17 ఏళ్ల నిండి ఉండాలి. ఎస్సీ వెల్ఫేర్ హాస్టళ్లో చదివిన వారికి ఏడాది మినహాయింపు ఉంటుంది. తల్లిదండ్రుల వార్షిక ఆదాయం రూ.లక్షలోపు ఉండాలి. ఎంపీసీ 40 సీట్లు, బైపీసీ 40 సీట్లు ఉండగా, ఎస్సీలకు 75 శాతం, బీసీ–సీలకు 12 శాతం, ఎస్టీలకు ఆరు శాతం, బీసీలకు 5 శాతం, ఇతరులకు రెండు శాతం రిజర్వేషన్లు అమలు చేస్తున్నారు.

ఏప్రిల్ 6న ప్రవేశ పరీక్ష

డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాలలో ఐదో తరగతిలో చేరే విద్యార్థినులకు ఏప్రిల్ 6న ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, జూనియర్ ఇంటర్‌లో చేరే విద్యార్థినులకు మధ్యాహ్నం 2 గంటల నుంచి 4 గంటల వరకు ప్రవేశ పరీక్ష జరుగుతుంది. ఐఐటీ, మెడికల్ కోచింగ్ ఎంట్రన్స్ పరీక్ష ఏప్రిల్ 20వ తేదీ ఉదయం 10 గంటలకు ఉంటుంది.

దరఖాస్తు విధానం

https://apbrafcet.apcfrr.in ద్వారా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి. దరఖాస్తుకు ఎటువంటి రుసుం చెల్లించాల్సిన అవసరం లేదు. దరఖాస్తులో ఐదో తరగతిలో చేరే పాఠశాల, కళాశాల వివరాలు నమోదు చేయాలి. ఆన్‌లైన్‌లో నమోదు చేశాక పాఠశాలలు/ కళాశాలల మార్పు కుదరదు. ప్రవేశ పరీక్షలో వచ్చే మార్కుల ఆధారంగా ఎంపిక ప్రక్రియ, సీట్ల కేటాయింపు ఉంటుంది. ఇతర వివరాలకు 89191 71792, 99086 81399 ఫోన్ నంబర్లలో సంప్రదించవచ్చు. అలాగే దరఖాస్తు చేయదలిచిన వారు అభ్యర్థి పాస్‌పోర్టు ఫొటో, ఆధార్ నకలు, ఐదో తరగతికి నాల్గవ తరగతి స్టడీ సర్టిఫికెట్/జూనియర్ ఇంటర్‌కు పదో తరగతి స్టడీ సర్టిఫికెట్, ఉపయోగములో ఉన్న ఫోన్‌తో బొమ్మూరులోని గురుకుల పాఠశాలకు వస్తే ఉచితంగా దరఖాస్తు నెట్‌లో అప్‌లోడ్ చేస్తారు. లేదా మీకు సమీపంలో ఉన్న నెట్‌సెంటర్‌లో దరఖాస్తు చేసుకోవచ్చు.

అమ్మ భాష.. అదే శ్వాస

నేడు అంతర్జాతీయ మాతృ భాషా దినోత్సవం

సీటీఆర్ఐ (రాజమహేంద్రవరం): మాతృ భాష గొప్పదనం మాటల్లో వర్ణించలేనిది. భావ వ్యక్తీకరణకు సులభమైన, సులక్షణమైన మార్గం అమ్మ భాష. ప్రపంచీకరణ నేపథ్యంలో భాషా వికాసం పెరిగింది. అయితే మనుగడ కోసం ఇతర భాషలు నేర్చుకోవడంలో తప్పులేదు. కానీ వాటి ప్రభావం మాతృ భాషపై పడకుండా జాగ్రత్త పడాలి. ఈ భాష కోసం బెంగాల్ యువకుల ఆత్మబలిదానం రగిల్చిన ఉద్యమ స్ఫూర్తితో అంతర్జాతీయ మాతృ భాషా దినోత్సవానికి పునాది పడింది. అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవం ఏటా ఫిబ్రవరి 21న నిర్వహించాలని 1999 నవంబర్ 17న యునెస్కో ప్రకటించింది. అప్పటి నుంచి ప్రపంచ వ్యాప్తంగా మాతృ భాషా దినోత్సవాన్ని నిర్వహించుకుంటున్నారు.

సాహిత్య కల్పన మాతృ భాషలోనే..



సాహిత్య కల్పన మాతృ భాషలోనే జరుగుతోంది. అందుకని బోధన కూడా మాతృ భాషలోనే ఉండాలి. మన భాషను పరిరక్షించుకోవాల్సిన అవసరం ఉంది. ముందు తరానికి ఆ మాధుర్యాన్ని అందించాలంటే నేటితరం తమ పిల్లలకు మన భాష గొప్పదనం తెలియజేయాలి.

–డాక్టర్ పీవీబీ సంజీవరావు, ఎస్‌కేవీటీ డిగ్రీ కళాశాల తెలుగుశాఖాధిపతి

భాషలకు సంస్కృతం మూలం



సంస్కృతం ప్రపంచంలోని పురాతన భాషల్లో ఒకటి. ఇది అనేక భాషలకు మూలం. ముఖ్యంగా తెలుగు, హిందీ, కన్నడ, మలయాళం మొదలైన వాటిపై సంస్కృతం యొక్క ప్రభావం చాలా ఉంది. సంస్కృతం కేవలం భాష మాత్రమే కాదు, ఇది మన సంస్కృతి. సంస్కృతం నేర్చుకోవడం ద్వారా, మనం పూర్వీకుల జ్ఞాన సంపదను అర్థం చేసుకోవచ్చు.

–పి.శ్రీవల్లి, సంస్కృత శాఖ అధ్యాపకురాలు, ఎస్‌కేఆర్ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల

ఇదేం దూకుడు..

- ఆగని మైనర్ల డ్రైవింగ్
- రాంగ్ రూట్లో రావడంతో ప్రమాదాలు
- పట్టించుకోని పోలీసులు



వై.జంక్షన్ సమీపంలో స్కూటీపై వేగంగా దూసుకుపోతున్న బాలిక

కంబాలచెరువు: యూత్ దూకుడుగా వెళ్తొంది.. బండెక్కితే రైయ్ రైయ్ అంటూ దూసుకుపోతోంది.. నిత్యం రద్దీగా ఉండే రాజమహేంద్రవరంలో మైనర్ల డ్రైవింగ్ సమస్యగా మారుతోంది. వీరు డ్రైవింగ్ లైసెన్సు లేకుండా, నిబంధనలను అతిక్రమించి అపసవ్య దిశలో ప్రయాణం చేస్తూ ఎదుటి వారికి ఇబ్బంది తెస్తున్నారు. నిండా 15 ఏళ్లు లేని బాలురు, బాలికలు మోటారు సైకిళ్లపై రయ్‌మంటూ దూసుకుపోతున్నారు. బాలురైతే బైక్‌లపై, బాలికలు స్కూటీలపై మెరుపు వేగంతో వెళ్తున్నారు. తెలిసీ తెలియని వయసులో, వేగంగా నడుపుతూ తమ ముందు వెళుతున్న వాహనాలను ఓవర్ టేక్ చేస్తున్నారు. ఇక బాలురైతే బండిపై విన్యాసాలు చేస్తూ, అదే వాహనంపై ముగ్గురికిపైగా కూర్చుని దూకుడుగా వెళ్లిపోతున్నారు. వాహనం గేర్ మార్చాలన్నా, ఎదురుగా ఏదైనా వస్తే బ్రేక్ వేసేందుకు కూడా వీరికి కుదరని వేగంతో వెళ్తూ ప్రమాదాలకు కారకులుగా మారుతున్నారు. నగరంలోని పలు ప్రాంతాలు, కూడళ్లలో నిత్యం ట్రాఫిక్ పోలీసులు విధులు నిర్వర్తిస్తుంటారు. వీరి ముందు నుంచే మైనర్లు డ్రైవింగ్ చేసుకుంటూ వెళ్తుంటారు. కనీసం వీరిని ఆపి కౌన్సెలింగ్ చేసేందుకు కూడా పోలీసులు ఆసక్తి చూపడం లేదు.

తల్లిదండ్రుల్లో మార్పు రావాలి

తల్లిదండ్రులు తమ పిల్లలకు ద్విచక్ర వాహనాలు ఇస్తున్నారు. వారిని వివిధ పనులపై పంపుతున్నారు. తమ పిల్లాడు బైక్ నడుపుతూ వేగంగా వెళుతుంటే అదేదో పెద్ద ఘనకార్యం సాధించినట్లు చెప్పుకొస్తుంటారు కొందరు తల్లిదండ్రులు. మైనర్లకు వాహనాలు ఇవ్వడం నేరం.. ఇది తెలిసినా చాలామంది తల్లిదండ్రుల్లో మార్పు రావడం లేదు. సక్రమంగా రాని డ్రైవింగ్‌లో చాలామంది మైనర్లు రోడ్డు ప్రమాదాలకు కారకులవుతున్నారు. తమ జీవితాలను ఛిద్రం చేసుకుంటున్నారు. నిబంధనలు పాటిస్తూ వాహనం నడుపుతూ రోడ్డుపై వెళ్తున్న వారిని, ఈ మైనర్లు ఎదురుగా వెళ్లి ఢీకొడుతున్నారు. ఇలాంటి అనేక సంఘటనలు నగరంలో సర్వసాధారణంగా జరుగుతున్నాయి.

చర్యలు చేపడతాం

మైనర్లకు వాహనం ఇవ్వడం నేరం. దీనికి వాహనం నడుపుతున్న మైనర్, తల్లిదండ్రులు ఇద్దరూ బాధ్యులే. దీనిపై ప్రత్యేక డ్రైవ్ చేపట్టి కేసులు రాస్తున్నాం. కేసులు రాసేది పోలీసుల కోసం కాదు. తిరిగి ఆ తప్పు చేయకుండా ఉండేందుకే. వాహనం డ్రైవింగ్ సమయంలో ఏదైనా ప్రమాదం జరిగితే ఇద్దరికీ జైలు శిక్ష తప్పదు. మైనర్లకు వాహనాలు నడపవద్దని, తల్లిదండ్రులు వారికి వాటిని ఇవ్వవద్దని కౌన్సెలింగ్ నిర్వహిస్తున్నాం.

–అబ్దుల్ నబీ, ట్రాఫిక్ సీఐ, రాజమహేంద్రవరం

సారాతో వ్యక్తి అరెస్ట్

రంగంపేట: సారాతో ఓ వ్యక్తిని అరెస్టు చేసినట్టు స్థానిక ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ స్టేషన్ సీఐ సుధ తెలిపారు. గురువారం ఆమె మాట్లాడుతూ ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ స్టేషన్ పరిధిలో దాడులు నిర్వహించామన్నారు. ఈ దాడుల్లో మర్రిపూడి గ్రామంలో సారా తయారీ, విక్రయాలు జరుపుతున్న దంగేటి దుర్గాప్రసాద్‌ను అరెస్టు చేసి, అతని నుంచి 800 లీటర్ల సారా తయారీకి ఉపయోగించే బెల్లపు ఊట, అల్యూమినియం పాత్రలు, డ్రమ్ములను స్వాధీనం చేసుకున్నామన్నారు. బెల్లపు ఊటను, అల్యూమినియం పాత్రలు, డ్రమ్ములను ధ్వంసం చేసి, దంగేటి దుర్గా ప్రసాద్‌ను రిమాండ్‌కు తరలించినట్టు ఆమె తెలిపారు. సారా విక్రయాలపై తగిన చర్యలు తీసుకుంటున్నామన్నారు.

వాహనదారులు నిబంధనలు పాటించాలి



సమావేశంలో మాట్లాడుతున్న సీనియర్ మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ సంపత్‌కుమార్

రాజమహేంద్రవరం రూరల్: రోడ్డు ప్రమాదాల్లో ఎక్కువ శాతం యువత మృత్యువాత పడడం దిగ్భ్రాంతి కలిగించే విషయమని, వాహనాలు నడిపేటప్పుడు నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని సీనియర్ మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ సీహెచ్ సంపత్‌కుమార్ అన్నారు. గురువారం కాతేరులోని వ్యవసాయ కళాశాలలో అసోసియేట్ డీన్ డాక్టర్ డి.శ్రీనివాస్ అధ్యక్షతన జాతీయ రహదారి భద్రతా ప్రచారంలో భాగంగా ‘శ్రద్ధ వహించండి’ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సీనియర్ మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ సంపత్‌కుమార్ మాట్లాడుతూ ప్రభుత్వం విధిస్తున్న వివిధ రకాల ఫైన్‌ల గురించి విద్యార్థులకు వివరించారు. రహదారి భద్రత గురించి విద్యార్థులు తమ తల్లిదండ్రులతో పాటు స్నేహితులకూ అవగాహన కల్పించాలని కోరారు. అసిస్టెంట్ మోటార్ ఇన్‌స్పెక్టర్ రాధికాదేవి మాట్లాడుతూ వాహనాలు నడిపేటప్పుడు హెల్మెట్ ప్రాముఖ్యతను వివరించారు. అసోసియేట్ డీన్ శ్రీనివాస్ మాట్లాడుతూ ద్విచక్ర వాహనం నడిపేటప్పుడు విధిగా హెల్మెట్ ధరించాలన్నారు. సమావేశంలో అధ్యాపకులు డాక్టర్ ప్రవీణ, డాక్టర్ వసంత భాను, డాక్టర్ శేఖర్, డాక్టర్ శ్రీనివాస్, డాక్టర్ గంగాధర్, విద్యార్థులు, బోధనేతర సిబ్బంది పాల్గొన్నారు.

ఉద్భవ్– 2025 వేడుకలు ప్రారంభం



ఉద్భవ్-2025 వేడుకలను ప్రారంభిస్తున్న ముఖ్య అతిథులు

కంబాలచెరువు (రాజమహేంద్రవరం): స్థానిక ఆర్ట్స్ కళాశాలలో ఉద్భవ్ –2025 వేడుకలు గురువారం ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా కళాశాల అధిపతులు డాక్టర్ రామచంద్ర ఆర్‌కే మాట్లాడుతూ విద్యార్థులలో సృజనాత్మకత, ప్రతిభను వెలికి తీసే విధంగా ఉద్భవ్-2025 ఏర్పాటు చేశామన్నారు. ఆర్జేడీ శోభారాణి విద్యార్థులు ఏర్పాటు చేసిన వివిధ స్టాల్స్‌ను దర్శించి, విద్యార్థులకు అభినందనలు తెలిపారు. ఆర్డీఓ కృష్ణనాయక్ మాట్లాడుతూ విద్యార్థుల్లో అంతర్లీనంగా ఉన్న నైపుణ్యాలకు వేదికగా ఆర్ట్స్ కళాశాల ఉద్భవ్ –2025 ఉందన్నారు. ఈ కార్యక్రమాన్ని కళాశాల అధ్యాపక, అధ్యాపకేతర బృందం పర్యవేక్షణలో సజావుగా ముందుకు తీసుకు వెళ్లడం బాగుందన్నారు. నిర్వాహకులు మాట్లాడుతూ అనేక రకాల సాంస్కృతిక, వినోద కార్యక్రమాలు, విద్యార్థుల ప్రతిభ ప్రదర్శనలు, ఆహార పదార్థాలు, వస్తువుల స్టాల్స్, వివిధ పోటీలు జరుగుతున్నాయన్నారు. కార్యక్రమంలో ఉద్భవ్ కమిటీ కోఆర్డినేటర్ డాక్టర్ మల్లికార్జున, అసిస్టెంట్ కోఆర్డినేటర్ డాక్టర్ సంజీవ్, కమిటీ సభ్యులు అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది పాల్గొన్నారు.

అందరికీ సమన్యాయమే లక్ష్యం



సమావేశంలో మాట్లాడుతున్న సీనియర్ సివిల్ జడ్జి శ్రీలక్ష్మి

కంబాలచెరువు (రాజమహేంద్రవరం): సమాజంలో అన్నివర్గాల ప్రజలకు సమన్యాయం చేయాలనే లక్ష్యంతో 1987లో న్యాయ సేవాధికార సంస్థ చట్టం అమలులోకి తీసుకువచ్చారని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి ఎస్.శ్రీలక్ష్మి తెలిపారు. స్థానిక ఆర్ట్స్ కళాశాల సమీపంలోని ఎస్‌సీసీ ఫ్యాకల్టీ డెవలప్‌మెంట్ అకాడమీ హాల్‌లో గురువారం ప్రపంచ సామాజిక న్యాయ దినోత్సవం నిర్వహించారు. దీనికి ముఖ్య అతిథిగా సీనియర్ సివిల్ జడ్జి ఎస్.శ్రీలక్ష్మి హాజరై డాక్టర్ అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

అనంతరం ఆమె మాట్లాడుతూ మహిళలు, వృద్ధులు, సంవత్సరానికి రూ.3 లక్షల ఆదాయం లోపు ఉన్న ప్రతి ఒక్కరూ, ఈ సంస్థ ద్వారా, న్యాయం పొందడానికి అర్హులేనన్నారు. ఏ విధమైన రుసుం చెల్లించాల్సిన అవసరం లేదని తెలిపారు. అలాగే ఎన్ని చట్టాలు, సంస్కరణలు చేసినా, సంఘంలో మహిళల స్థితి ఆశించిన రీతిలో లేదని, ఇంకా అత్యాచారాలు జరుగుతూనే ఉన్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. విద్యార్థినులు వారి జీవిత పురోగమనానికి, వారే బాధ్యత తీసుకోవాలని, ఎల్లప్పుడూ, తమ జాగ్రత్తలో తాముండాలని అన్నారు. సోషల్ వెల్ఫేర్ డిప్యూటీ డైరెక్టర్ శోభారాణి మాట్లాడుతూ సామాజిక న్యాయం అందరికీ అందాలనే ఆశయంతో పేద బీసీ, ఎస్సీ, ఎస్టీకి చెందిన వారికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనేక చట్టాలను రూపొందించి, రాయితీలు కల్పిస్తున్నాయన్నారు. అందులో భాగంగానే ఈ రోజు విద్యార్థినులు సంక్షేమ హాస్టల్స్‌లో చక్కగా చదువుకుంటూ, క్షేమంగా ఉండగలుగుతున్నారన్నారు. ఉన్నత స్థానాలను అందుకుంటూ, తమ తల్లిదండ్రులకు ఆసరాగా నిలవాలని హితవు పలికారు. కార్యక్రమాన్ని డీఎల్ఎస్ఏ ప్యానెల్ లాయర్ దేవిక నిర్వహించగా, డీటీ డబ్ల్యూఓకేఎస్ జ్యోతి, డీబీసీ డబ్ల్యూఓ బి.శశాంక, డీటీ డబ్ల్యూ రాజు, ఏఎస్ డబ్ల్యూ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

విధి నిర్వహణలో అలసత్వంపై ఆగ్రహం

కంబాలచెరువు (రాజమహేంద్రవరం): ఎస్ఆర్ఎస్ చేసి వెళ్లిపోతున్న వైద్యులకు తూర్పుగోదావరి జిల్లా కలెక్టర్ ప్రశాంతి హెచ్చరికలు జారీ చేశారు. విధి నిర్వహణ వేళ నిర్దిష్ట సమయంలో ఆసుపత్రిలో విధుల్లో కొనసాగాల్సిన వైద్యుల్లో కొందరు విధుల్లో ఉండక ఎస్ఆర్ఎస్ వేసి వెళ్లిపోతున్న నేపథ్యంలో కలెక్టర్ ఆదేశాలకు అనుగుణంగా రాజమహేంద్రవరం జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ లక్ష్మి సూర్యప్రభ గురువారం సర్క్యులర్ జారీ చేశారు. ఐవీఆర్ఎస్ ద్వారా ప్రభుత్వం రాజమహేంద్రవరం ప్రభుత్వ ఆసుపత్రిలో రోగులకు అందుతున్న వైద్య సేవలపై ప్రజాభిప్రాయ సేకరణ చేపడుతోందని ఆమె పేర్కొన్నారు. దీనిలో వైద్యులు అందుబాటులో ఉంటున్న సమయాల ప్రస్తావన కూడా ఉందన్నారు. తగిన అనుమతులు లేకుండా సెలవులపై వెళ్లొద్దని సూచించారు. విధి నిర్వహణలో సమయపాలన అనుసరించాలన్నారు. ఎస్ఆర్ఎస్ వేసి వెళ్లిపోతున్న పలువురు వైద్యులను గుర్తించి వారిని ఇప్పటికే హెచ్చరించామని, తీరు మార్చుకోకపోతే చర్యలు తప్పవన్నారు. విధి నిర్వహణలో నిబంధనలను అతిక్రమించి వ్యవహరించే వైద్యులపై సీసీఏ నిబంధనల ప్రకారం చర్యలు చేపట్టాలని కలెక్టర్ ఆదేశించారని సూపరింటెండెంట్ తెలిపారు. హెచ్ఓడీలు, ఫ్యాకల్టీ బాధ్యతాయుతంగా వ్యవహరించాలని పేర్కొన్నారు.

రాగిజావ స్టాల్ ప్రారంభం



సెంట్రల్ జైలు ఎదురుగా మహిళా ఖైదీలతో ఏర్పాటు చేసిన రాగిజావ స్టాల్

కంబాలచెరువు: సెంట్రల్ జైలులోని ప్రత్యేక మహిళా కారాగారం ఆధ్వర్యంలో జైళ్ల ఉప శాఖాధికారి ఎంఆర్ రవికిరణ్ రాగిజావ స్టాల్‌ను జైల్ ఎదురుగా గురువారం ప్రారంభించారు. ఈ స్టాల్‌లో రాగి జావ (తీపి, సాల్ట్) ఉడకబెట్టిన వేరుశెనగ గుళ్లు, గుడ్లు, మొలకెత్తిన గింజలు, ఫ్రూట్ సలాడ్ అందుబాటులో ఉంటాయి. ప్రభుత్వాసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ సూర్యప్రభ, జిల్లా ఫైర్ ఆఫీసర్ శ్రీనివాసరావు దీనికి హాజరయ్యారు. ప్రజలకు తక్కువ ఖర్చుతో ఆరోగ్యపరమైన రుచికరమైన అల్పాహారం అందించవచ్చన్నారు. అలాగే మహిళా కారాగారంలో విడుదలైన తర్వాత ఖైదీలు చదువు రాని వారిగా ఉండిపోకుండా, సైతం బయట ప్రపంచంలోకి వచ్చాక వారి బతుకు తెరువుకు ఇలాంటి ఆరోగ్యపరమైన స్టాల్స్ పెట్టుకుని జీవనభృతిని సంపాదించుకోవచ్చని జైళ్ల శాఖ డీజీ రవికిరణ్ అన్నారు. జైలులో ఉన్న బేకరిలో తయారైన బ్రెడ్లు, బిస్కెట్లు, సుధార్ పిండి వంటలు ప్రిజన్ కేఫ్‌లో అందుబాటులో ఉన్నాయన్నారు. మహిళా ఖైదీలచే నడుపబడుతున్న ఆరుబయలు జైలులో కూరగాయలు, ఆకుకూరలు అమ్ముతున్నామన్నారు. కార్యక్రమంలో మహిళా జైలు పర్యవేక్షణాధికారి ఈజీ వసంతకుమారి, సర్కిల్ ఇన్‌స్పెక్టర్ సైదయ్య, జైలర్ పీలా పావని, డిప్యూటీ జైలర్ కె.సుభాషిణి, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

అన్నప్రసాద వితరణ

కడియం: దుళ్లలో శ్రీషిర్డీసాయి మందిరంలో దాతల సహకారంతో గురువారం అన్నప్రసాద వితరణ జరిగింది. మందిర కమిటీ పర్యవేక్షణలో భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలుగకుండా ఏర్పాట్లు చేశారు. అలాగే ఉదయం నుంచి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు.

ఆర్థిక సాయం పంపిణీ

కడియం: మండపేటకు చెందిన నేలపు అమృత వర్షిణి వైద్యానికి కడియపులంక జనసేన నాయకులు రూ. 20 వేల ఆర్థిక సాయం అందజేశారు. తలసేమియాతో చిన్నారి బాధపడుతుండగా, పదిహేనేళ్లు వచ్చిన తరువాత మాత్రమే ఆపరేషన్ చేయడానికి వీలవుతుందని వైద్యులు వివరించారు. ఈ లోపు చెన్నైలోని సీఎంసీ హాస్పటల్‌లో చిన్నారికి చికిత్స అందిస్తున్నారు. ఈ నేపథ్యంలో చిన్నారికి ఆర్థిక సాయం అందించినట్లు నాయకులు పాటంశెట్టి రాంజీ, గట్టి సుబ్బారావు తదితరులు తెలిపారు.

సినిమాలు



శ్యామల: సంక్రాంతికి వస్తున్నాం
సూర్యమినీ: రిటర్న్ ఆఫ్ ది డ్రాగన్
సూర్యప్యాలెస్: చావా
స్వామి: బ్రహ్మ ఆనందం
శివజ్యోతి: రామం రాఘవం
అనుశ్రీ: లైలా
రాజా: సంక్రాంతికి వస్తున్నాం
ఊర్వశి: రామం రాఘవం
మేనక: తల
రంభ: బాపు
కుమారి: రిటర్న్ ఆఫ్ ది డ్రాగన్
అప్సర: తండేల్
అశోక: జాబిలమ్మ నీకు అంత కోపమా
నామవరం:
వీఎస్.మహల్: తండేల్
ధవళేశ్వరం:
మురళీకృష్ణ: తండేల్